
సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 22 । జూన్ । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3వేల క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.95 అడుగులుగా ఉంది.



విలువలతో బోధన

ఉత్తమ విలువలతో బోధన, విద్యా ప్రమాణాల మెరుగు, క్రీడా ప్రతిభను వెలికి తీయడం, సమైక్యతా భావం పెంపొందించడం జవహర్ నవోదయ విద్యాలయాల ప్రత్యేకత.

8లో

గరిష్టం/కనిష్టం
39.5°/25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.5	25.0
కాకినాడ	37.6	25.8
అమలాపురం	38.0	27.0

న్యూస్‌రీల్

పీహెచ్‌సీల్లో ఈ-హెల్త్ రికార్డు విధానం అమలు



ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: ఇక నుంచి ప్రతి పీహెచ్‌సీలో ఈ-హెల్త్ రికార్డు విధానం అమలులోకి రానుందని డీఎంఅండ్ హెచ్ఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయంలో వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాళ్లపూడి పీహెచ్‌సీలో సిబ్బంది పని తీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు వేస్తున్న వ్యాక్సిన్లు, యాప్‌లలో నమోదుపై పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగి వివరాలను ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి సిబ్బందిని సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రమణ నాయక్, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 12.9 మి.మీ సరాసరి వర్షపాతం

కొవ్వూరు: నైరుతి రుతు పవనాల ప్రభావంతో మంగళవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా సరాసరి 12.9 మి.మీటర్ల వర్షం కురిసింది. తాళ్లపూడి, సీతానగరం, చాగల్లు మండలాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం ఎనిమిది గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో తాళ్లపూడిలో గరిష్టంగా 50.2, సీతానగరంలో 48.2, చాగల్లులో 30.0, రాజమహేంద్రవరం అర్బన్‌లో 14.6, రంగంపేటలో 14.4, గోపాలపురంలో 10.2, ఉండ్రాజవరంలో 20.6, కోరుకొండలో 18.0 మి.మీటర్లు కురిసింది. గోకవరం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, నల్లజర్ల, కొవ్వూరు, నిడదవోలు మండలాల్లో చెదురుమదురు వర్షం కురిసింది.

కేంద్రీయ విద్యాలయ అభివృద్ధికి చర్యలు : ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి కొత్త భవన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్టు కేంద్ర మంత్రిత్వ శాఖ కేవీ సంఘటన్ కమిషనర్ తెలిపారు. ఈమేరకు తనకు లిఖితపూర్వక సమాధానమిచ్చినట్లు ఎంపీ భరత్‌రామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయంలో నెలకొన్న సమస్యల గురించి ఈనెల 5న లేఖ రాశామన్నారు. అధునాతన వసతులతో కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. దీనిపై ఢిల్లీ కేవీ సంఘటన్ కమిషనర్ తరఫున జాయింట్ కమిషనర్ డాక్టర్ పి.దేవకుమార్ స్పందించారన్నారు. కొత్త కేవీ ప్రారంభానికి సంబంధించి వచ్చిన ప్రతిపాదనను పరిశీలన కోసం హైదరాబాదు ఆర్వోకు పంపారన్నారు. భూమిని, అద్దె రహిత తాత్కాలిక భవనాన్ని అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా మంత్రిత్వ శాఖలు సిఫారసు చేయాల్సి ఉంటుందన్నారు. అవసరమైన చర్యలపై హైదరాబాదు ఆర్వోకు ప్రతిపాదనను పంపిస్తున్నట్టు దేవకుమార్ తనకు పంపిన సమాధానంలో పేర్కొన్నారని ఎంపీ వివరించారు.

24 నుంచి జగనన్న సురక్ష

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి వలంటీర్ ఈనెల 24 నుంచి 30 వరకు తన పరిధిలోని ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని, జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలసి బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. సచివాలయాల ద్వారా 534 పౌర సేవలు అందించడానికి ప్రతి అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలన్నారు. అర్హులను గుర్తించడంతో గ్రామ సభల్లో ధ్రువ పత్రాలను అందించి, సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపడమే లక్ష్యంగా జగనన్న సురక్ష నిర్వహిస్తున్నామన్నారు. 11 సేవలను ఉచితంగా అందించాల్సి ఉంటుందన్నారు. జగనన్న సురక్షలో గుర్తించిన లబ్ధిదారులకు ఆగస్టు ఒకటి ప్రయోజనాలను అందించాల్సి ఉంటుందన్నారు.



సీతానగరం మండలానికి చెందిన చిన్ని అనే విద్యార్థిని బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో సతమతమయ్యేది. చదువుపై దృష్టి సారించలేకపోయేది. శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. అందుకు రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషించుకునే వీరికి అంత మొత్తం వెచ్చించే స్థోమత లేకపోవడంతో ఆరోగ్యశ్రీ సిబ్బందిని ఆశ్రయించారు. రూపాయి ఖర్చు లేకుండా ఓ ప్రైవేటు వైద్యశాలలో శస్త్రచికిత్స చేశారు. వైద్యం అనంతరం ఖర్చులకు రూ.5 వేల ఆసరా సొమ్ము కూడా చెల్లించారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని ఆనందంగా కళాశాలకు వెళుతోంది.

రాజానగరం మండలం పాలచెర్ల గ్రామానికి చెందిన సత్యదుర్గ అనే మహిళ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడేది. వైద్యులకు చూపించగా కిడ్నీ తొలగించాలని, అందుకు రూ.3 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. ఏ పని దొరికితే ఆ పని చేసుకుంటూ జీవనం సాగించే వారికి అంత డబ్బు పెట్టే స్థోమత లేకపోవడంతో ఆరోగ్యశ్రీ సిబ్బందిని ఆశ్రయించారు. నయాపైసా ఖర్చు లేకుండా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు.

పేదింట ఆరోగ్య సిరి

- విస్తృతంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు
- ప్రజలకు ఉచితంగా ఖరీదైన కార్పొరేట్ వైద్యం
- ఎంతోమందికి సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదం
- చికిత్స అనంతరం ఖర్చులతో ఆసరా
- నాలుగేళ్లలో వ్యయం రూ.415.77 కోట్లు

సాక్షి, రాజమహేంద్రవరం: పేదలకు ఆధునిక, కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలనే తలంపుతో ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సత్ఫలితాలనిస్తోంది. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు, ఖరీదైన వైద్యం అందించి ఆరోగ్య ప్రదాతగా నిలుస్తోంది. ఎంతో మంది ప్రాణాలు కాపాడే సంజీవనిగా మారింది. చావుబతుకుల మధ్య ఉన్న వారికి పునర్జన్మ ప్రసాదిస్తోంది. సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసి ప్రజల మన్ననలు పొందుతోంది. తన తండ్రి వైఎస్సార్ శ్రీకారం చుట్టిన పథకానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ప్రజలకు మరింతగా అండగా నిలిచేలా చేశారు. గడిచిన నాలుగేళ్లలో రూ.కోట్లు వెచ్చించారంటే పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత అర్థం అవుతోంది.

జిల్లాలో ఇలా..

తెల్లరేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తోంది. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో జిల్లా వ్యాప్తంగా 88 ఆస్పత్రులను ఎంపిక చేసింది. అందులో ప్రైవేటు ఆస్పత్రులు 55, ప్రభుత్వ వైద్యశాలలు 30, మరో మూడు ఎంపిక ప్రక్రియలో ఉన్నాయి. 16 దంత వైద్య శాలలు(ఈహెచ్‌ఎస్) సైతం వైద్య సేవలు అందిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని అభాసుపాలు చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందకుండా చేసింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని పటిష్టం చేస్తూ చర్యలు తీసుకున్నారు. ఈ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోంది.




రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఆరోగ్య మిత్ర క్యాబిన్, ఆస్పతిలోని ఆరోగ్యశ్రీ వార్డు

రూ.415 కోట్ల ఖర్చు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్లలో పథకం అమలుకు భారీగా ఖర్చు చేస్తోంది. ఇప్పటి వరకు రూ.415.77 కోట్లు వైద్యం, శస్త్ర చికిత్సలకు వెచ్చించారు. 2,07,391 మందికి వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులు చేశారు.ఏటా రూ.50 కోట్లకు పైనే నిధులు ప్రజారోగ్యం కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం స్కీం వర్తింపచేస్తున్నారు. గుండె, లివర్ ప్లాంటేషన్, క్యాన్సర్ వంటి ఖరీదైన శస్త్ర చికిత్సలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు.

పెరుగుతున్న వ్యాధుల సంఖ్య

ఆరోగ్యశ్రీలో ఏటా వ్యాధుల సంఖ్య పెంచుతూనే ఉన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 938 వ్యాధులతో ప్రారంభమైన ప్రస్థానం ఏడాది వ్యవధిలోనే 2,446 రకాల వ్యాధుల వరకు వచ్చింది. తాజాగా వాటిని మరింత పెంచుతూ 3,275 వ్యాధుల వరకు విస్తరించారు. కొత్తగా 829 వ్యాధులను అదనంగా చేర్చారంటే ప్రజారోగ్యం ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఆరోగ్య ఆసరా

ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేలకు తక్కువ కాకుండా అందజేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 26 కేటగిరిల్లో 1,519 రకాల చికిత్సలు చేయించుకున్న 1,10,000 మందికి రూ.66.78 కోట్లు చెల్లించారు.

3,275 వ్యాధులకు వైద్యం



ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అందుకు అనుగుణంగా పథకం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆస్పత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. అర్హులైన వారికి ఆలస్యం కాకుండా వైద్యం అందేలా చూస్తున్నాం. చికిత్స అనంతరం ఆసరా నిధులు సైతం వెంటనే వారి ఖాతాలకు జమ చేస్తున్నాం. గతంలో 2,446 వ్యాధులు ఉండగా.. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వాటి సంఖ్య 3,275కు చేరింది. ఇది నిరుపేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– పి.ప్రియాంక, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్

నాలుగేళ్లలో వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)

సంవత్సరం	శస్త్రచికిత్సలు	నిధులు
2019-2020	25,750	62.71
2020-2021	29,602	62.15
2021-2022	47,039	89.48
2022-2023	1,05,000	201.43

మార్గదర్శకాలు

- ఆరోగ్యశ్రీ పథకంలో అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.
- ఈ క్రమంలో ఆరోగ్యశ్రీ నిబంధనలు కఠినతరం చేసింది.
- పథకం అమలు, పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఎం అండ్‌హెచ్ఓ, డీసీహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌లు పర్యవేక్షిస్తుంటారు.
- ఆస్పత్రులపై వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై తక్షణం చర్యలు తీసుకుంటారు.
- ఆస్పత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండాలి.
- డ్యూటీ డాక్టర్, స్పెషలిస్టు వైద్యులతో పాటు నర్సు, పారా మెడికల్ సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి.
- పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. రోగులకు నాణ్యమైన మందులు, పౌష్టికాహారం అందజేయాలి.
- ఆరోగ్యమిత్రతో కూడిన హెల్ప్‌డెస్క్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- ఆరోగ్యశ్రీ పరిధిలోని వ్యాధులకు చికిత్సను నిరాకరిస్తే ఆయా నెట్‌వర్క్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటారు.

ఇక ఇంటికే పౌష్టికాహారం

- వచ్చే నెల ఒకటి నుంచి అమలు
- గర్భిణులు, బాలింతల ఇళ్లకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో 1,556 అంగన్‌వాడీ కేంద్రాలు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు, బాలింతలు

రాజమహేంద్రవరం రూరల్: మాతాశిశు సంరక్షణపై జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న కిట్ల రూపంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నివారించేలా వైద్యసేవలతో పాటు పౌష్టికాహారాన్ని సమకూర్చుతోంది. వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది. ప్రస్తుతం అంగన్ వాడీ కేంద్రాల ద్వారా రుచికరమైన ఆహారాన్ని వడ్డిస్తోంది. కొందరికి అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉండడం, రాకపోకలకు బాలింతలు,గర్భిణులు ఇబ్బందులు పడుతుండడాన్ని ప్రభుత్వం గుర్తించింది. వారి సంక్షేమమే ధ్యేయంగా భావించి జూలై ఒకటో తేదీ నుంచి ఇంటికే పౌష్టికాహారం అందజేయాలని ఆదేశాలిచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన ఆహారానికి బదులుగా టేక్‌హోమ్‌రేషన్(టీహెచ్‌ఆర్) ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై బాలింతలు, గర్భిణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ప్రయోజనం

జిల్లాలో 1,530 అంగన్‌వాడీ కేంద్రాలు, 26 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 49,870మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 18,041మంది ఉన్నారు. జిల్లాలో 10,708 మంది గర్భిణులు, 9,459మంది బాలింతలు ఉన్నారు. వీరందరికి ఇళ్ల వద్దకే రేషన్ అందజేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సరకులు పంపిణీ ఇలా...

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నమోదైన గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సరకులను ఇంటికే రెండు విడతల్లో సరఫరా చేస్తారు. నెలకు మూడు కేజీల బియ్యం, కిలోకందిపప్పు, అర కేజీ నూనె, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు, కిలో రాగిపిండి, కిలో జొన్నపిండి, కిలో అటుకులు, పావుకిలో బెల్లం, పావుకిలో ఖర్జూరం, పావుకిలో చిక్కీలు జగనన్న కిట్ ద్వారా పంపిణీ చేస్తారు. ఏడు నెలల నుంచి 36 నెలలలోపు చిన్నారులకు నెలకు 2.5 లీటర్ల పాలు, 2.5 కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లను ఇంటివద్దకే ఇస్తారు. ప్రీస్కూల్ పిల్లలకు రోజూ కేంద్రాల్లో 100 మి.లీ పాలు, కోడిగుడ్లు ఇస్తారు.

రెండు విడతల్లో అందజేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ప్రభుత్వం వండి పెడుతున్న ఆహారానికి బదులుగా టీహెచ్‌ఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. జూలై ఒకటి నుంచి అమలవుతుంది. ఒకటి నుంచి ఐదోతేదీలోపు మొదటివిడతగా, 16,17 తేదీల్లో రెండోవిడతగా సరకులు అందజేస్తాం.

– విజయ కుమారి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారి

27న ఎస్వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నిడదవోలు : నిడదవోలు ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. టీసీఎల్, కాలిబ్ హెచ్‌ఆర్, ముతూట్ ఫైనాన్స్, నవతా ట్రాన్స్‌పోర్టు కంపెనీలలో సుమారు 100 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాల్లో పనిచేసేందుకు ఎంకాం, ఎంబీఏ, ఇంటర్, ఐటీఐ, పదో తరగతి అర్హతకలిగిన 19 నుంచి 30 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీల బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం 96760 52454, 95818 10049 నంబర్లను సంప్రదించాలని కొండలరావు కోరారు.

పవర్ పునర్విభజన

- పెద్దాపురం, రాజమహేంద్రవరంలలో కొత్తగా రెండు విద్యుత్ డివిజన్లు
- సెక్షన్‌లపై పని భారం తగ్గించే ప్రణాళిక
- మలి దశలో సర్కిళ్ల విభజనకు కసరత్తు
- నాణ్యతా సేవలందించే దిశగా అడుగులు



సాక్షిప్రతినిధి, కాకినాడ: విద్యుత్‌శాఖపై పని భారాన్ని తగ్గించి నాణ్యమైన సేవలందించే దిశగా కసరత్తు మొదలైంది. విద్యుత్ సరఫరా, నియంత్రణ వ్యవస్థలను నడిపించే పలు విభాగాలను వికేంద్రీకరించేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రణాళిక రూపొందించింది. చాన్నాళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రపురం, జగ్గంపేట విద్యుత్ డివిజన్లు రాజమహేంద్రవరం సర్కిల్ పర్యవేక్షణలో ఉన్నాయి.

విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను సర్కిల్ ఎస్ఈ ఒక్కరే పర్యవేక్షించడం కష్టంగా ఉంది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో విద్యుత్ డివిజన్లను కూడా విభజించాలని నిర్ణయించారు. ఇప్పుడున్న ఆరు డివిజన్లకు అదనంగా కాకినాడ జిల్లాలో పెద్దాపురం, తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఏర్పాటు చేయనున్నారు.

పెరిగిపోయిన కనెక్షన్లు

సెక్షన్ పరిధిలో విద్యుత్ కనెక్షన్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఏపీఎస్ఈబీ ఉన్నప్పుడు 10 వేల కనెక్షన్లకు ఒక సెక్షన్ ఉండాలని సూచించింది. ప్రస్తుతం 25 వేల నుంచి 30వేల వరకూ ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా, సాంకేతిక సమస్యల పరిష్కారం లాంటి వివిధ అంశాలు పరిగణనలోకి తీసుకుని కొత్తగా సెక్షన్ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. తొలి దశలో డివిజన్ల విభజన పూర్తయ్యాక సెక్షన్లపై దృష్టి పెట్టనున్నారు. రెండు దశలు కొలిక్కి వచ్చాక ఏ జిల్లాకు ఆ జిల్లా సర్కిల్ కార్యాలయం కూడా ఏర్పాటవుతుంది.

పెద్దాపురానికి లైన్ క్లియర్

ప్రస్తుతం కాకినాడ డివిజన్ పరిధిలో పెద్దాపురం డివిజన్ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయ్యింది. కాకినాడ డివిజన్‌లో అత్యధికంగా 21 సెక్షన్లు ఉన్నాయి. కాకినాడ సిటీలో కొత్తగా కాకినాడ-డి-8, డి-9 సెక్షన్లు కూడా వచ్చాయి. ఈ డివిజన్ నుంచి కొన్ని సెక్షన్లను విభజించి పెద్దాపురం డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. ఇంతవరకు కాకినాడలోని కాకినాడ రూరల్, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం సెక్షన్లు కూడా పెద్దాపురం డివిజన్‌లోకి తీసుకువస్తున్నారు.

రాజమహేంద్రవరం రూరల్ పరిధి ఇలా

రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, జగ్గంపేట డివిజన్లలోని పలు సెక్షన్లను విభజించి రాజమహేంద్రవరం రూరల్ డివిజన్‌ను ఏర్పాటు చేయనున్నారు. జగ్గంపేట డివిజన్‌లోని రంగంపేట, గండేపల్లి, రామచంద్రాపురం డివిజన్‌లోని బిక్కవోలు, ద్వారపూడి సహా రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, గోకవరం, కోరుకొండ, సీతానగరం, సంపత్‌నగర్, మురమండ సెక్షన్లు కూడా కొత్త కొత్త డివిజన్‌లోకి వస్తున్నాయి. ఇంతవరకు తూర్పుగోదావరి జిల్లాలో నిడదవోలు, రాజమహేంద్రవరం డివిజన్లు ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ డివిజన్‌కు ఈఈగా డి.శ్రీధర్ వర్మ బాధ్యతలు తీసుకున్నారు.

ఉద్యోగుల సర్దుబాటు

నిడదవోలు డివిజన్‌లోని పెనుగొండ, పెనుమంట్ర మండలాలు నరసాపురం డివిజన్‌లోకి వెళ్లనున్నాయి.పెనుగొండ సబ్‌డివిజన్‌లో పెరవలి మండలాన్ని నిడదవోలు డివిజన్‌కు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో నల్లజర్లను నిడదవోలు డివిజన్‌లోకి తీసుకువస్తున్నారు. రెండు డివిజన్లలోని సెక్షన్లను తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉండేలా చూస్తున్నారు. కొత్త డివిజన్‌ల పరిధిలో ఉద్యోగుల సర్దుబాటు కసరత్తు వారం, పది రోజుల్లో కొలిక్కిరానుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కేడర్‌లకు చెందిన 800 మంది ఉద్యోగులున్నారు. వీరి నుంచి ఆప్షన్లు కూడా తీసుకున్నారు.

త్వరగానే విభజన ప్రక్రియ పూర్తి



డివిజన్‌ల పునర్విభజన ప్రక్రియ జరుగుతోంది. పని భారం తగ్గించే లక్ష్యంతో ఈ విభజన జరుగుతోన్న మాట వాస్తవమే. కొత్తగా రెండు డివిజన్‌లు వస్తున్నాయి. వారం, పది రోజుల్లో ఈ ప్రక్రియ అంతటినీ పూర్తి చేసేందుకు యుద్ధప్రాపతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. ఈ విభజన పూర్తి అయితే మరింత మెరుగ్గా సేవలందించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– టి.వి.ఎస్.ఎన్.మూర్తి, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఏపీఈపీడీసీఎల్.

ఒంటికి యోగా మంచిదేగా..




అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో బుధవారం పలు కార్యక్రమాలు జరిగాయి. వివిధ విద్యా సంస్థల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. గోదావరి తీరాన సరస్వతీ ఘాట్ వద్ద సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సంస్థకు చెందిన వారు హాజరై యోగా, ధ్యానం గురించి వివరించారు.

–కంబాలచెరువు(రాజమహేంద్రవరం)

క్లుప్తంగా

నేతన్న నేస్తం దరఖాస్తుకు జీఎస్టీ అవసరం లేదు

అమలాపురం రూరల్: వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద దరఖాస్తు చేసుకునే చేనేత కార్మికులు జీఎస్టీ బిల్లులు నమోదు చేయవలసిన అవసరం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల తొలుత జీఎస్టీ బిల్లులు సమర్పించాలనే నిబంధన అధికారులు పొందుపరిచారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆప్కో చైర్మన్ చిరంజీవి బుధవారం తీసుకువెళ్లి నేత కార్మికుల ఇబ్బందులను తెలియజేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ తక్షణమే స్పందించి జీఎస్టీ నిబంధనను ఎత్తివేశారని ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంలో జీఎస్టీ కాలమ్ తొలగించారని చెప్పారు. చేనేత కార్మికులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ నేతన్న నేస్తం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. జీఎస్టీ నిబంధన తొలగించి నేత కార్మికులకు వెసులుబాటు కల్పించిన సీఎం జగనన్న, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవికి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌నకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన వైద్య ఆరోగ్యశాఖ బదిలీలు



హెడ్ నర్స్‌లకు బదిలీలు నిర్వహిస్తున్న డాక్టర్ పద్మశశిధర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ జోన్ 2 పరిధిలో చేపట్టిన బదిలీలు బుధవారం ముగిశాయి. ఈ నెల 19వ తేదీ నుంచి తూర్పుగోదావరి, కృష్ణా, ఏలూరు, భీమవరం, ఏఎస్ఆర్, కాకినాడ, కోనసీమ, ఎన్టీఆర్ జిల్లాల్లోని హెల్త్ వర్కర్లకు ప్రాంతీయ వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ పద్మశశిధర్ ఆధ్వర్యంలో బదిలీలు నిర్వహించారు. చివరిరోజు హెడ్ నర్స్‌లు 17 మంది హాజరుకాగా నలుగురికి, ఎంపీహెచ్ఎస్ ఫిమేల్స్‌లో 74 మందిలో 48 మందికి బదిలీలు జరిగాయి. మూడురోజుల పాటు నిర్వహించిన బదిలీలు ప్రశాంతంగా ముగిశాయని ఆర్డీ డాక్టర్ పి.పద్మశశిధర్ తెలిపారు. బదిలీలు నిర్వహించిన వారందరికీ ఉత్తర్వులు ఇచ్చామన్నారు.

స్కూటీలో పెట్టిన రూ.59 వేలు మాయం

యానాం: స్కూటీ డిక్కీలో పెట్టిన రూ.59 వేలు కనిపించకపోవడంతో బాధితుడు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ప్రముఖుడు, వ్యాపారస్తుడు రాముడు రాజు, స్థానిక విష్ణాలయం వీధిలో తన స్కూటీని నిలిపి ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంకు పక్కనే ఉన్న ఒక వస్త్ర దుకాణం వద్దకు వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా స్కూటీ డిక్కీ తెరిచి ఉందని, అందులోని రూ.59వేలు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శేరు నూకరాజు ఆధ్వర్యంలో పక్కనే ఉన్న వివిధ వ్యాపార సంస్థల సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

విలువలతో బోధన.. సమైక్యత సాధన

- నవోదయకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆగస్టు 10 వరకు ఆన్‌లైన్‌లోనే స్వీకరణ
- జనవరి 20న ప్రవేశ పరీక్ష

రాయవరం: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేశారు. ఉత్తమ విలువలతో బోధన, విద్యా ప్రమాణాల మెరుగు, క్రీడా ప్రతిభను వెలికి తీయడం, సమైక్యతా భావం పెంపొందించడం ఈ విద్యాలయాల ప్రత్యేకత. దేశవ్యాప్తంగా 595 నవోదయ విద్యాలయాలు ఉండగా..కాకినాడ జిల్లాలో పెద్దాపురంలో ఉంది. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఇక్కడ మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరు నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్యను ఇక్కడ అందిస్తారు.

ఒక్కసారే అవకాశం

ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి విద్యాలయంలో ప్రవేశం లభిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయాల్లో మొత్తం 80 సీట్లు ఉంటాయి. ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఆయా మండలాల్లో ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. ప్రవేశ పరీక్షకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2012 మే ఒకటో తేదీ నుంచి 2014 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 3,4 తరగతులు ఉత్తీర్ణత సాధించి ఐదవ తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు.



జవహర్ నవోదయ విద్యాలయం

రిజర్వేషన్ విధానం

నవోదయలో ప్రవేశానికి రిజర్వేషన్ విధానం అమలవుతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం సీట్లు కేటాయిస్తారు. షెడ్యూల్ కులాలకు 15శాతం, షెడ్యూల్ తరగతులకు ఏడు శాతం, దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రవేశాల్లో బాలికలకు 33శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తారు.

వసతులు

బాలబాలికలకు ప్రత్యేక ఉచిత వసతి గృహాలు, భోజనం, విద్య, నోట్‌బుక్స్ ఉచితంగా అందజేస్తారు. స్కూల్ యూనిఫామ్, షూస్, టాయిలెట్ సామగ్రి అంతా ఉచితమే. అర్హతతో పాటుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నవోదయ విద్యాలయాల్లో బోధన చేస్తారు. శాస్త్ర, సాంకేతికతతో కూడిన విద్య, క్రీడలు, యోగా ద్వారా విద్యార్థికి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కల్పిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నామమాత్రపు రుసుం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు, బాలికలకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసిన తర్వాత దరఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని దగ్గర ఉంచుకోవాలి. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. ఆగస్టు10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాల్సి ఉంది.

గతేడాది జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..

జిల్లా	వచ్చిన దరఖాస్తులు
కోనసీమ	3,714
తూర్పుగోదావరి	1,444
కాకినాడ	3,621

పరీక్షా విధానమిదీ..

ప్రవేశ పరీక్షను 2024 జనవరి 20న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తారు. విద్యార్థులు చదువుతున్న భాషను(తెలుగు/ఇంగ్లిషు) ఎంచుకొని పరీక్ష రాసే వీలుంది. 80 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. మూడు విభాగాల్లో ప్రశ్నలు కేటాయిస్తారు. మేధాశక్తి (మెంటల్ ఎబిలిటీ)పై 40 ప్రశ్నలు 50 మార్కులకు, గణితం(అర్థమెటిక్), భాషపై ఒక్కొక్క విభాగానికి 20 ప్రశ్నల వంతున 40 ప్రశ్నలు 50 మార్కులకు ఉంటాయి. తప్పుడు సమాధానాలకు నెగిటివ్ మార్కులు ఉండవు. దివ్యాంగులకు 40 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. పరీక్షా పత్రాల రూపకల్పన నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై ప్రవేశానికి ఎంపికైన వారికి మొదటి రెండు సంవత్సరాలు తెలుగు/ఇంగ్లిషు భాషల్లో బోధిస్తారు. అనంతరం ఇంగ్లిషులోనే బోధన చేస్తారు.

చక్కటి అవకాశం

జవహర్ నవోదయలో ప్రవేశ పరీక్ష గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చక్కటి అవకాశం. అన్ని మండల విద్యాశాఖ అధికారులకు జవహర్ నవోదయ దరఖాస్తులు పంపిణీ చేస్తున్నాం. దరఖాస్తు చేయాలనుకునే ప్రతి విద్యార్థికి దరఖాస్తును అందజేస్తాం.

– కె. రామిరెడ్డి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, పెద్దాపురం



బాధ్యత తీసుకోవాలి

అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. ప్రవేశ పరీక్షను విద్యార్థులతో రాయించడం వల్ల వారిలో పోటీ పరీక్షలను ఎదుర్కొగలిగే ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ



ఆదిత్యలో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ విద్యాసంస్థలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 23, 24 తేదీలలో అడ్వాన్స్‌డ్, గ్లోబల్ ఇంజినీరింగ్ ఛాలెంజెస్ (ఏజీఈసీ)పై ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఏజీఈసీ–2023 ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్నతస్థాయి పరిశోధన, తాజా ఆవిష్కరణలకు సహకరించడానికి, ప్రదర్శించడానికి విద్యార్థులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, శాస్త్రవేత్తలకు అద్భుతమైన, అంతర్జాతీయ వేదికగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సదసు ప్రధాన ఇతివృత్తం 'సుస్థిర అభివృద్ధి కోసం తదుపరి తరం సాంకేతికత' అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల డీన్లు, పాల్గొన్నారు.

24, 25 తేదీలలో పెంటాథలాన్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాథలాన్ పోటీలు ఈ నెల 24, 25 తేదీలలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. తొమ్మిది సంవత్సరాలు నిండినవారు ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. లేజర్ రన్, స్విమ్మింగ్ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. విజేతలు త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారన్నారు. ఆసక్తి గలవారు 90309 78888, 94908 96851 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గోదావరి యాత్ర ఆవిష్కరణ

పాల్గొన్న ఎంపీ, కలెక్టర్, ప్రముఖులు



గోదావరి యాత్ర పుస్తకావిష్కరణలో పాల్గొన్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎంపీ గీత, దర్శకుడు వంశీ తదితరులు

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సంస్కృతి, సంప్రదాయాలు, రుచులు, ఆధ్యాత్మిక కేంద్రాల సమగ్ర సమాహారంతో రూపొందించిన 'గోదావరి యాత్ర' పుస్తకావిష్కరణ వేడుకగా సాగింది. జర్నలిస్ట్ డాక్టర్ సబ్బెళ్ళ శివన్నారాయణరెడ్డి సారథ్యంలో స్థానిక డి కన్వెన్షన్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, ప్రముఖ దర్శకులు, సినీ రచయిత వంశీ, సహా పలువురు ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత జిల్లా కలెక్టర్, ఎంపీతోపాటు పాల్గొన్న ప్రముఖులు కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గోదావరి యాత్ర సీడీలను, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా విశిష్టతలను అందరికీ తెలిసేలా చేసిన చక్కని ప్రయత్నమని ప్రశంసించారు. కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ గోదావరి యాత్ర అవార్డు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీగా ఎంపికైన కర్రి పద్మశ్రీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ వాడ్రేవు రవి, సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెర్ల మురళీధర్, సురుచిఫుడ్స్ అధినేత మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. 'గోదావరి యాత్ర' పుస్తకాన్ని అన్నపూర్ణమ్మగా పేరుగాంచిన డొక్క సీతమ్మకు అంకితం చేశారు.

చోరీ కేసు నమోదు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంకు చెందిన ఓలేటి విజయలక్ష్మికి చెందిన బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయని బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు తెలిపారు. ఈ నెల 18 ఉదయం 11 గంటలకు పని మనిషికి డబ్బులు ఇచ్చే సమయంలో బంగారు ఆభరణాలు, నగదు ఉన్నాయని, 19న చూసుకోగా ఎనిమిది కాసుల రెండు గొలుసులు, రెండు గాజులతోపాటుగా రూ.20 వేలు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సమర్పణరావు తెలిపారు.

భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం

స్మగ్లర్లను పట్టుకున్న కాకినాడ కస్టమ్స్ బృందం

కాకినాడ క్రైం: కాకినాడ కస్టమ్స్ బృందం భారీ గంజాయి స్మగ్లింగ్‌ను అడ్డుకుంది. సంబంధిత వివరాలను రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ రిషి గోయల్ వివరిస్తూ బుధవారం రాత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివరాల మేరకు, ఈ నెల 19వ తేదీన కాకినాడ కస్టమ్స్ పరిధిలో కొవ్వూరులో వ్యాన్ ద్వారా ఓ భారీ స్మగ్లింగ్ చోటు చేసుకోబోతోందన్న విశ్వసనీయ సమాచారంతో కస్టమ్స్ బృందం అప్రమత్తమైంది. అర్ధరాత్రి దాటాక రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వైపు వెళుతున్న వాహనాన్ని ప్రివెంటివ్ బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో రూ.85.73 లక్షల విలువైన 428.68 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి ఇద్దరినీ కస్టడీకి ఇస్తూ బుధవారం కొవ్వూరు రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు ఉత్తర్వులిచ్చారు.

పంట కాలువలో మహిళ మృతదేహం

అమలాపురం రూరల్: అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామ శివారు అమలాపురం – చల్లపల్లి గ్రామం ప్రధాన పంట కాలువలో బుధవారం సాయంత్రం మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సత్తి సత్యనారాయణమూర్తి కొబ్బరి తోటకు ఎదురుగా ఉన్న పంట కాలువలో సుమారు 45 నుంచి 55 సంవత్సరాలు మధ్య వయసు గల ఊరు, పేరు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బోర్లగా పడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ శవం ఉబ్బి, దుర్వాసన వస్తున్నట్లు చెప్పారు. వీఆర్వో ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అందే పరదేశి తెలిపారు. వివరాలు తెలిసిన వారు అమలాపురం తాలూకా పోలీసులకు తెలియజేయాలని ఎస్సై కోరారు.

బైక్‌లు చోరీ చేసిన వ్యక్తికి ఏడాది జైలు

మండపేట: రెండు బైక్‌లను చోరీ చేసిన ముద్దాయికి ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం జడ్జి డాక్టర్ దీపదైవకృప బుధవారం తీర్పు చెప్పారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామానికి చెందిన ముద్దాయి కోరాడ వెంకటేశ్వర్లు రెండు బైక్‌లను చోరీ చేసినట్టు పట్టణ పోలీసు స్టేషన్లో ఎస్సై ఎం.అశోక్ కేసులు నమోదు చేశారు. 2022 డిసెంబర్ 30న పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద హోండా యాక్టివా మోటారు బైక్, 2023 ఫిబ్రవరి 3న కేపీ సెంటర్‌లో ప్యాషన్ ప్రో మోటార్ బైక్‌ను ముద్దాయి చోరీ చేశాడు. బాధితుల తరపున ఏపీపీ విశ్శ శ్రీరాములు వాదించారు.

అతివేగంతో ప్రమాదం

స్వల్ప గాయాలతో బయటపడ్డ వైనం



ప్రమాదంలో లారీని ఢీకొన్న కారు

గండేపల్లి: వాహనం అతి వేగంగా నడపడం వల్ల జరిగిన ప్రమాద ఘటనలో ప్రాణనష్టం తప్పి స్వల్పగాయాలతో వ్యక్తి బయటపడ్డ వైనం హైవేలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు కథనం మేరకు విశాఖ జిల్లాకు చెందిన రౌతు వెంకటేశ్వరరావు విజయవాడ సెక్రటేరియట్‌కు వెళ్లేందుకు తెల్లవారుజామున తన కారులో బయలుదేరాడు. మండలంలోని మల్లేపల్లి శివారు పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి అతివేగంగా వెళుతూ రోడ్డు పక్కనే నిలిచి ఉన్న వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో కారు ముందుభాగంలో ఎడమ వైపు చక్రం ఊడిపోయి అప్పటికే ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావుకు స్వల్ప గాయాలు కాగా అతడిని స్థానికులు, ప్రయాణికులు బయటకు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రోడ్డు మెయింటినెన్స్ సిబ్బంది ప్రమాదానికి గురైన కారును, లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. కునుకుపాట్ల వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతానికి లైన్‌మన్ మృతి



గోపాలకృష్ణ మృతదేహం

దేవరపల్లి: విద్యుదాఘాతానికి గురై గోపాలపురం మండలం చిట్యాలలో విద్యుత్ శాఖ లైనమన్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం చిట్యాలలో విద్యుత్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కోలా వీరవెంకటగోపాలకృష్ణ (45) బుధవారం విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా తీగలు తగిలి పై నుంచి సిమెంట్ రోడ్డుపై పడ్డారు. తీవ్రంగా గాయపడగా 108 అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యాధికారి నిర్ధారించారు. మంగళవారం రాత్రి వీచిన బలమైన ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తోటి సిబ్బందితో కలిసి బుధవారం లైన్లు మరమ్మతు చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

యూనియన్ సభ్యుల ఆందోళన

గోపాలకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని, లైన్‌మన్లు, సిబ్బందిపై పనివత్తిడి తగ్గించాలని, గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యూనియన్ నాయకులు ఆందోళన నిర్వహించారు. డీఈఈ వీరభద్రరావు, ఏడీఈ రవిశంకర్, ఏఈ ప్రభాకరావు ఆసుపత్రి వద్దకు వచ్చి యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ పరంగా రావలసిన అన్ని వచ్చేటట్టు చేస్తామని, అతని కుటుంబాన్ని ఆదుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

దాడి ఘటనలో అన్నదమ్ములకు రిమాండ్

రంగంపేట: దాడి ఘటనలో అన్నదమ్ములకు రిమాండ్ విధించినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన నీలపాలదేవికి ఆమె భర్త నీలపాల శ్రీనుకి మనస్పర్ధలు ఉన్నాయి. గత నెల 27వ తేదీ రాత్రి దేవి ఇంద్రపాలెం తమ బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లి తన అక్క కుమారుడైన వెంకట్ బైక్‌పై తిరిగి వస్తోంది. ముకుందవరం గ్రామం వద్ద ఎవరూ లేనిచోట దేవి భర్త శ్రీను, అతని తమ్ముడు నీలపాల సత్యనారాయణలు వారి బైక్‌కు అడ్డుగా తమ బైక్ పెట్టి దేవిని బైక్‌పై నుంచి కిందకు లాగి తాటిపట్టితో దాడిచేసి గాయపరిచారు. చుట్టుపక్కలవారు రావడంతో అక్కడ నుంచి పరారయ్యారు. దీనిపై బాధితురాలు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితులను మంగళవారం మండలంలోని రామేశంపేట నుంచి సింగంపల్లి వెళ్లే రోడ్డులో బీలాలమ్మ గుడివద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి బైక్ స్వాధీనపరచుకున్నామన్నారు. ముద్దాయిలను పెద్దాపురంలో కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని చెప్పారు.

ఆచార్య టేకి సేవలు స్ఫూర్తిదాయకం



ఆచార్య టేకి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: యూనివర్సిటీ అభివృద్ధిలో ఆచార్య ఎస్.టేకి భాగస్వామ్యం ఎంతో ఉందని, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, ఓఎస్‌డీగా అనేక సేవలను అందించారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామంటూ 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డిజైన్ థింకింగ్' కార్యక్రమాన్ని బుధవారం వీసీ ప్రారంభించారు. తొలుత ఆచార్య టేకి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కన్వీనర్‌గా వ్యవహరించిన డాక్టర్ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగానికి ఆచార్య ఎస్.టేకి వెన్నుదన్నుగా నిలిచేవారన్నారు. ఆయన అందించిన ప్రోత్సాహంతోనే యూనివర్సిటీలో మొదటిసారిగా అంతర్జాతీయ సదస్సును ప్రారంభించామన్నారు. రీసోర్సు పర్సన్ ఆచార్య ఎస్ఎంకే భట్టా మాట్లాడుతూ విన్నూత్న ఆలోచనలు, నూతన పోకడలను, సమస్య పరిష్కారాలను, నిర్ణయ ప్రక్రియలు.. ఇవన్నీ డిజైన్ థింకింగ్‌లో భాగమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, రీసెర్చ్ సెల్ డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, డాక్టర్ ఉమామహేశ్వరి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.